ములుగు-జయశంకర్ భూపాలపల్లి
శుక్రవారం 8 డిసెంబర్ 2023



- ధాన్యాన్ని ఆరబెట్టేందుకు రైతుల అగచాట్లు
- పలుచోట్ల నష్టాన్ని పరిశీలించిన వ్యవసాయ అధికారులు
- నల్లబారిన పత్తి.. రైతుల ఆందోళన

# ముంచిన మిగ్‌జాం

ఇంకా నీళ్లలోనే పంటలు



చిన్నగూడూరు: తడిసిన వరి ధాన్యాన్ని చూపుతున్న రైతు కుటుంబం

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, డిసెంబర్ 7: దాదాపు మూడు రోజులుగా కమ్ముకున్న ముసురు.. అక్కడక్కడా మోస్తరు నుంచి భారీ వర్షాలు అన్నదాతలను నిండా ముంచాయి. మిగ్‌జాం తుఫాను కారణంగా చేతికొచ్చిన పంట నీటిపాలు కాగా ధాన్యాన్ని ఆరబెట్టేందుకు రైతులు నానాకష్టాలు పడుతున్నారు. ముఖ్యంగా ములుగు, మహబూబాబాద్, వరంగల్ జిల్లాల్లో తుఫాను ప్రభావం ఉండగా, వరి, మక్క, మిరప, పత్తి పంటలకు నష్టం వాటిల్లింది. పలు ప్రాంతాల్లో వ్యవసాయ అధికారులు గురువారం పంట నష్టాన్ని పరిశీలించారు. మరికొద్ది రోజుల్లో కోయాల్సిన పంట నీటిలో తేలుతుండడంతో ఏమీ పాలుపోక రైతులు దిగులు పడుతున్నారు. మరోవైపు పత్తి పంట నల్లబారడంతో ఆందోళన చెందుతున్నారు. చేతికొచ్చిన పత్తి తడిసిపోవడంతో కన్నీరుపెట్టుకుంటున్నారు. చేతికొచ్చిన పంట పావడంతో పాటు చేలల్లో ఉన్న పంటకు చీడపీడలు ఆశించే ప్రమాదముందని భయపడుతున్నారు. మరోవైపు ఈదురుగాలులతో కూడిన వాతావరణంతో ప్రజలు ఇండ్లకే పరిమితమై వ్యాధులతో సతమతమవుతున్నారు. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు దగ్గు, జలుబు, జ్వరంతో అవస్థపడుతున్నారు.



బయ్యారం : తడిసిన వరిధాన్యాన్ని ఆరబెడుతున్న రైతులు



శాయంపేట : ఆరెపల్లిలో నీటిలో తేలుతున్న వరి పంట



నర్సింహులపేట : రామన్నగూడెంలో మిరప పంటను పరిశీలిస్తున్న హెచ్‌వో రాకేశ్



శాయంపేట : వానలతో నల్లబడిన పత్తి చేను

---

ఓరుగల్లు నుంచి మంత్రులుగా ఇద్దరు ఆడబిడ్డలు

# క్యాబినెట్‌లోకి సీతక్క, సురేఖ..

- ములుగు ఎమ్మెల్యే సీతక్క, వరంగల్ తూర్పు ఎమ్మెల్యే కొండా సురేఖను వరించిన పదవులు
- మంథని నుంచి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు చోటు
- హుస్నాబాద్ నుంచి పొన్నం ప్రభాకర్‌కు అవకాశం
- శాఖల కేటాయింపులో రాని స్పష్టత



వరంగల్, డిసెంబర్ 7(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఉమ్మడి జిల్లా నుంచి ఇద్దరు మహిళలకు రాష్ట్ర ప్రభుత్వంలో మంత్రులుగా అవకాశం దక్కింది. ములుగు ఎమ్మెల్యే సీతక, వరంగల్ తూర్పు ఎమ్మెల్యే కొండా సురేఖ మంత్రులుగా బాధ్యతలు చేపట్టారు. మరోవైపు భూపాలపల్లి, హనుమకొండ జిల్లాల్లో భాగంగా ఉన్న మంథని, హుస్నాబాద్ నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలుగా గెలిచిన దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ మంత్రులుగా నియమితులయ్యారు. ఇలా ఉమ్మడి వరంగల్ జిల్లాకు నలుగురు మంత్రులు ప్రతినిధ్యం వహించనున్నారు. హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో గురువారం సాయంత్రం వీరు మంత్రులుగా ప్రమాణస్వీకారం చేసినా సీఎం రేవంత్‌రెడ్డి వీరికి ఇంకా శాఖలను కేటాయించారు. కొండా సురేఖ గతంలో మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రిగా పనిచేశారు. 2009 ఎన్నికల అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వంలో కొండా సురేఖ తొలిసారి మంత్రి అయ్యారు. ఇప్పుడు రెండోసారి ఇదే శాఖల బాధ్యతలు నిర్వర్తిస్తారని ప్రచారం జరిగింది. వరంగల్ ఉమ్మడి జిల్లా నుంచి ఇద్దరు మంత్రులు ఉండడం అనవాయితీగా వస్తున్నది. తెలంగాణ రాష్ట్రంలో ఈ పరంపరం కొనసాగుతున్నది. తొలిసారిగా ఇద్దరు మహిళలకు ఈ అవకాశం దక్కింది. కాగా వరంగల్ ఉమ్మడి జిల్లా నుంచి మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసిన సీతక్క, కొండా సురేఖలకు ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ఉద్యోగులు, వివిధ వర్గాల ప్రజలు శుభాకాంక్షలు తెలిపారు.

## ఎంపీటీసీ నుంచి మంత్రిగా సురేఖ



వరంగల్, డిసెంబర్ 7(నమస్తే తెలంగాణ): వరంగల్ జిల్లా గీసుగొండ మండలం వంచనగిరికి చెందిన కొండా సురేఖ 1995లో కాంగ్రెస్ తరపున వంచనగిరి ఎంపీటీసీగా.. గీసుగొండ మండల ఎంపీపీగా గెలుపొందడంతో అప్పటినుంచి తన రాజకీయ ప్రస్థానం మొదలైంది. 1999లో శాయంపేట నుంచి ఎమ్మెల్యేగా గెలిచి తొలిసారిగా శాసనసభలో అడుగుపెట్టారు. 1999లో మహిళా, శిశు సంక్షేమ కమిటీ సభ్యురాలిగా, ఆరోగ్య, ప్రాథమిక విద్య స్టాండింగ్ కమిటీ సభ్యురాలిగా పనిచేశారు. 2000లో ఏఐసీసీ సభ్యురాలిగా ఎంపికయ్యారు. 2004లో రెండోసారి శాయంపేట నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. 2004లో కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ కార్యదర్శిగా, ఏఐసీసీ కో ఆప్షన్ సభ్యురాలిగా, అఫీషియల్ స్పోక్స్ పర్సన్‌గా పనిచేశారు. 2005లో వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌లో ఎక్స్ అఫీషియో మెంబర్‌గా పనిచేశారు. 2009 అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలుపొంది ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మంత్రి వర్గంలో తొలిసారి మంత్రి పదవి చేపట్టారు. మహిళా, శిశు సంక్షేమశాఖ మంత్రిగా పనిచేశారు. 2014లో వరంగల్ తూర్పు నియోజక వర్గం నుంచి ఎమ్మెల్యేగా గెచారు. 2023 ఎన్నికల్లోనూ వరంగల్ తూర్పు నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలిచి రెండోసారి మంత్రిగా గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. ఇప్పటి వరకు ఐదు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన కొండా సురేఖ రెండో సారి జిల్లా నుంచి మంత్రి అయ్యారు.

## నలుగురు సీఎంల మంత్రి వర్గాల్లో దుద్దిళ్ల



కాటారం, డిసెంబర్ 7 : కాటారం మండలం ధన్వాడకు చెందిన దుద్దిళ్ల శ్రీధర్‌బాబు 1999లో మొదటిసారిగా మంథని నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. వరుసగా మూడు పర్యాయాలు 1999, 2004, 2009లో ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2009లో సీఎంలు వైఎస్ రాజశేఖర్ రెడ్డి , కిరణ్‌కుమార్ రెడ్డి, రోశయ్య మంత్రి వర్గంలో శ్రీధర్‌బాబు మంత్రిగా పని చేశారు. అనంతరం 2018లో జరిగిన ఎన్నికల్లో మరోసారి ఎమ్మెల్యేగా గెలిచారు. 2023 ఎన్నికల్లో ఐదోసారి ఎమ్మెల్యేగా గెలిచి మంత్రిగా నియమితులయ్యారు. ఎన్నికల సమయంలో మ్యానిఫెస్టో కమిటీ చైర్మన్‌గా పని చేశారు.

## ఎన్ఎస్‌యూఐ నుంచి ఎదిగిన పొన్నం



కాంగ్రెస్ అనుబంధ విద్యార్థి విభాగం ఎన్ఎస్‌యూఐలో పని చేసిన పొన్నం ప్రభాకర్ 2004లో కరీంనగర్ అసెంబ్లీ సెగ్మెంట్ నుంచి ఇండిపెండెంట్‌గా పోటీ చేసి ఓటమిపాలయ్యారు. 2009లో కరీంనగర్ ఎంపీగా ఎన్నికయ్యారు. 2014లో ఇదే స్థానంలో ఓటమిపాలయ్యారు. 2018లో కరీంనగర్ ఎమ్మెల్యేగా, 2019లో కరీంనగర్ ఎంపీగా పోటీ చేసి ఓటమిపాలయ్యారు. తాజా ఎన్నికల్లో హుస్నాబాద్ ఎమ్మెల్యేగా గెలుపొంది మంత్రిగా బాధ్యతలు చేపట్టారు.

## అంచెలంచెలుగా ఎదిగిన సీతక్క



ములుగు, డిసెంబర్ 7 (నమస్తేతెలంగాణ) : ములుగు మండలం జగ్గన్నపేటలో పుట్టిన ధనసరి అనూయ (సీతక్క), 1988లో పదో చదువుతున్న కాలంలో పూలందేవి రచనలకు ప్రేరేపితమై విప్లవోద్యం వైపు అడుగులు వేశారు. ఈ క్రమంలో సీపీఐ(ఎంఎల్) జనశక్తిలో చేరి ఆదివాసీల తరపున పోరాటం చేశారు. నక్సల్ నాయకుడు కుంజ రామును వివాహం చేసుకున్నారు. వారికి ఒక కుమారుడు సూర్య కాగా, ఉమ్మడి వరంగల్ జిల్లాలో జనశక్తి దళం లీడర్‌గా సీతక్క ప్రధాన భూమిక పోషించారు. సుమారు రెండు దశాబ్దాల పోరుబాటను 1997లో వదిలి జనజీవన స్రవంతిలో కలిశారు. 2001లో హైదరాబాద్‌లో న్యాయవిద్య చదివారు. ఈ క్రమంలో అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సీతక్కకు 2004లో టీడీపీ తరపున ఎమ్మెల్యే టికెట్ కేటాయించారు. తొలిసారి ఎన్నికల్లో సమీప అభ్యర్థి పోదెం వీరయ్య(కాంగ్రెస్) చేతిలో సీతక్క ఓటమి పాలయ్యారు. 2009లో టీడీపీ మహా కూటమి తరపున పోటీ చేసి పోదెం వీరయ్యపై గెలుపొంది తొలిసారిగా శాసనసభ సభ్యురాలిగా అసెంబ్లీలో అడుగు పెట్టారు. 2014లో టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి టీఆర్ఎస్ అభ్యర్థి అజ్మీరా చందూలాల్ చేతిలో ఓటమి పాలయ్యారు. 2017లో రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. 2018 ఎన్నికల్లో టీఆర్ఎస్ అభ్యర్థిపై గెలుపొందారు. 2022 డిసెంబర్ 10న తెలంగాణ కాంగ్రెస్ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా నియమితులయ్యారు. అనంతరం ఏఐసీసీ మహిళా ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్నారు. ప్రస్తుత 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిపై గెలుపొంది తొలిసారిగా మంత్రి పదవి చేపట్టారు.

---

అశోకా థియేటర్ వద్ద ఏర్పాటు చేసిన దుకాణం.. ఉన్ని దుస్తులు కొంటున్న వినియోగదారులు






హనుమకొండలోని అశోకా థియేటర్ వద్ద ఏర్పాటు చేసిన ఉన్ని దుస్తుల దుకాణాలు

- కమ్ముకున్న మబ్బులు.. కొరికేస్తున్న చలిగాలులు
- గజగజ వణుకుతున్న ప్రజలు
- స్వెటర్లు, జర్కిన్ల కోసం పరుగులు
- సందడిగా ఉన్నివస్త్ర దుకాణాలు

# ఒకటే ఇగం

హనుమకొండ చౌరస్తా, డిసెంబర్ 7: మిగ్‌జాం తుఫాన్ తెచ్చిన చలితో ఉమ్మడి జిల్లా ప్రజలు గజగజ వణుకుతున్నారు. మూడురోజులుగా చిరుజల్లులు కురుస్తుండడంతోపాటు చలిగాలులు వీస్తుండడంతో బయటకు రావాలంటే బెంబేలెత్తుతున్నారు. చలి తీవ్రరూపం దాల్చడంతో ప్రతి ఒక్కరూ ఉన్నిదుస్తులు ధరించి ఉపశమనం పొందుతున్నారు. తుఫాన్ కారణంగా పెరిగిన చలితో ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. తెరిపిలేకుండా చలిగాలులు వీస్తుండడంతో ముఖ్యంగా చిన్న పిల్లలు, వృద్ధులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. గురువారం వరకు వాతావరణం మరింత చల్లబడడంతో ఎటు చూసినా ప్రజలు స్వెటర్లు, జర్కిన్లు, టోపీలు ధరించి బయట రావడం కనిపించింది. చలికారణంగా పల్లె, పట్టణం తేడాలేకుండా రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. మధ్యాహ్నం సైతం సూర్యుడి జాడ కనిపిండం లేదు. పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు సైతం ఇప్పుడు స్వెట్టర్లు ధరించే విద్యాసంస్థలకు వెళ్తున్నారు. చలి తీవ్రత ప్రజల ఆరోగ్యంపై ప్రభావం చూపుతున్నది. రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పడిపోతుండడంతో రక్షణ కోసం ఉలన్ (ఉన్ని) దుస్తుల కొనుగోళ్లు పెరిగాయి.

### స్వెటర్లు, జర్కిన్లకు గిరాకీ

నగరంలోని వివిధ ప్రాంతాల్లో టిబెట్ దేశస్తులు స్వెటర్ల దుకాణాలు ఏర్పాటు చేశారు. హనుమకొండలోని పాత మున్సిపల్ మైదానంలో షెడ్లు వేసుకొని ఉన్నిదుస్తులు విక్రయిస్తున్నారు. హనుమకొండ చౌరస్తా, సెంట్రల్‌జైలు, ఎంజీఎం రోడ్డు, ములుగురోడ్డులో అమ్మకాలు జరుపుతున్నారు. చలితీవ్రత పెరగడంతో ఉన్ని దుస్తుల వ్యాపారానికి గిరాకీ పెరిగింది. వివిధ రకాల స్వెటర్లు, జర్కిన్లు, రగ్గులు, శాలువాలు, చిన్న పిల్లల మంకీ క్యాప్‌లు, చెవులకు కట్టుకునే ఊలు వస్త్రాలు జోరుగా అమ్ముడవుతున్నాయి. గ్లౌజులు, టోపీలు, మాస్కులు, స్కార్ఫ్‌లు, సాక్సులు అందుబాటులో ఉన్నాయి. ధర రూ.300 నుంచి రూ.1500 వరకు ఉంటుందని వ్యాపారులు చెబుతున్నారు.

### చలి ఎక్కువ పెడతాంది..



మూడు రోజులుగా చలి ఎక్కువ పెడతాంది. తుఫాన్ కారణంగా వణుకు వస్తోంది. బయటకు రావాలంటే స్వెటర్లు, జర్కిన్లను వేసుకొని వస్తున్నం. చిన్న పిల్లలు, మహిళలు, వృద్ధులు చలికి గజగజ వణుకుతున్నరు. దీన్ని తట్టుకునేందుకు అందరూ వెచ్చని దుస్తులను వేసుకుంటున్నారు. పిల్లలకు స్వెటర్లు కొనేందుకు ఫ్యామిలీతో ఇక్కడికి వచ్చిన.

– గుంకటి కిరణ్‌కుమార్, హనుమకొండ

### స్వెటర్ కొనేందుకు వచ్చిన



చలి బాగ ఉండడంతో స్వెటర్ కొనేందుకు వచ్చిన. బయటకు రావాలంటే ఇబ్బందిగ ఉంది. తుఫాన్‌తో వణుకు పుడుతోంది. మూడురోజులుగా ఎండ రావడం లేదు. చలి నుంచి కాపాడుకునేందుకు స్వెటర్, మాస్కు పెట్టుకోవాల్సి వస్తోంది.

– మంజుల, హనుమకొండ

### గిరాకీ బాగుంది..



నా చిన్నప్పటి నుంచి ప్రతి సంవత్సరం చలికాలంల టిబెట్ నుంచి ఇక్కడి వస్తున్నం. హనుమకొండ పాతమున్సిపల్ మైదానంలో స్వెటర్లు, జర్కిన్లు, శాలువాలు, గ్లౌసులు, సాక్సులు అమ్ముతున్నం. వ్యాపారం అనుకున్న స్థాయిలో ఉండడం లేదు. తుఫాన్‌తో చలి తీవ్రత ఎక్కువగ ఉంది. ఇప్పుడు గిరాకీ పెరిగింది. గతం కంటే ఇప్పుడు ఫర్వాలేదు.– కర్మ, వ్యాపారి, టిబెటెన్